నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 20 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

రైతులను మోసం చేయొద్దు

- అలా చేసే వ్యాపారులపై చర్యలు తీసుకొని లైసెన్స్‌లు రద్దు చేస్తాం
- ఇక నుంచి మార్కెట్ యార్డులోనే ఉద్యాన, వ్యవసాయ అధికారులు
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిశీలనలో కలెక్టర్ వీపీ గౌతమ్
- మిర్చి ధరల పతనంపై 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం వ్యవసాయం, జనవరి 19: మిర్చి ధరల విషయంలో రైతులను ఖరీదుదారులు మోసం చేయొద్దని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. అలా చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఖమ్మం ఏఎంసీలో మిర్చి ధరల పతనంపై 'ధర దగా..' శీర్షికన నమస్తే తెలంగాణలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి ఖమ్మం మిర్చియార్డును శుక్రవారం పరిశీలించి మిర్చి పంట కొనుగోళ్లను తనిఖీ చేశారు. మిర్చి రైతులతో చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన మిర్చి పంటకు ధర తగ్గిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మార్కెటింగ్‌శాఖ సంచాలకులు, ఉన్నతాధికారులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. నాణ్యత మేరకు ధర రావడం లేదని ఆరోపణలు వస్తున్నందున వాటి పర్యవేక్షణకు ముగ్గురు వ్యవసాయశాఖ అధికారులను నియమించినట్లు తెలిపారు. అలాగే తాలు, వైరస్, నాణ్యతా ప్రమాణాల పరీక్షకు ఉద్యాన శాఖ నుంచి టెక్నికల్ అధికారిని వ్యవసాయ మార్కెట్లో నియమించినట్లు చెప్పారు. వీరంతా మార్కెట్లో పూర్తి సమయం అందుబాటులో ఉంటారన్నారు. జెండాపాట రూ.20 వేలు ఉండగా, శుక్రవారం ధర రూ.20,500 పలికిందన్నారు. కానీ గురువారం ధర రూ.21,300 పలికిందని అన్నారు. వైరస్, తుఫాను వల్ల నాణ్యత తగ్గిన మిర్చిపంట క్వింటాకు రూ.13 వేల నుంచి రూ.17 వేల వరకూ ధర పలుకుతోందని అన్నారు. ధాన్యం కొనుగోలు మాదిరిగా మిర్చి కొనుగోలులోనూ తేమశాతంపై చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత పేరుతో రైతులను ఖరీదుదారులు నష్ట పరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారను. వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి బస్తా కొనుగోలు అయ్యే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, పీడీఎం ఐపీ రమణ, మార్కెట్ కమిటీ గ్రేడ్-టూ అధికారి బజార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.22 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

విలేకరుల సమావేశంలో నిందితులను చూపుతున్న ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.22 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు. ఖమ్మం నగరంలోని కమిషనరేట్‌లో శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వివరాలు వెల్లడించారు. టీఎస్ ఎస్పీ సత్తుపల్లి బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరం లక్ష్మీనారాయణ ఇంట్లో గత డిసెంబర్ 19న చోరీ జరిగింది. ఘటనపై లక్ష్మీనారాయణ సత్తుపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును ఛాలెంజ్‌గా తీసుకున్న సెంట్రల్ క్రైమ్ టీం, సత్తుపల్లి పోలీసులు విచారణ ప్రారంభించారు. ఘటనా స్థలాల్లో దొరికిన ఆధారాలతో జిల్లాలను జల్లెడ పట్టారు. ఇటీవల నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిని మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మంగనివాడకు చెందిన బీమిలి రాజ్‌కుమార్ అలియాస్ టిల్లు, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రామన్ననగర్‌కు చెందిన నీలాల అనీల్‌కుమార్, తోట నరేష్, హైదరాబాద్‌కు చెందిన మచ్చా ఆదర్స్‌గా గుర్తించారు. వారి నుంచి 216 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు తొమ్మిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన సొత్తు విలువ రూ.22 లక్షల వరకు ఉంటుంది. నలుగురు నిందితులూ గతంలో బాలనేరస్తులు. జైలు జీవితంలో వీరి మధ్య స్నేహం ఏర్పడింది. తర్వాత ముఠాగా ఏర్పడి రెండు తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట, వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, సూర్యాపేట జిల్లాలోని మోతె, నూతనకల్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం రూరల్, నిడమనూరు, నేరేడుచర్ల, మిర్యాలగూడెం-1, వాడపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అలాగే ఏపీలోని ఏలూరు జిల్లా ఏలూరు-1టౌన్‌లో రెండు కేసులు, ఏలూరు-3, కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో కేసులు నమోదయ్యాయి. తాళాలు వేసి ఉన్న ఇల్లు, నిర్మానుష ప్రాంతాల్లో ఉండే ఇళ్లే వీరి టార్గెట్. నిందితులకు గంజాయి రవాణా కేసులతోనూ ప్రమేయం ఉన్నది. ఖమ్మం జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసులను ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించి రివార్డులు అందించారు. విలేకర్ల సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్, సీసీఎస్ ఏసీపీ రవి, సీసీఎస్ సీఐలు బి.బాలాజీ, బి.బాలకృష్ణ, సత్తుపల్లి సీఐ మోహన్‌బాబు, సీసీఎస్ సిబ్బంది మంగిత్యా, గజేంద్ర, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

- సబ్జెక్టు నిపుణులతో మండలానికో బృందం ఏర్పాటు
- 24న హెచ్ఎంలతో కలెక్టర్ సమీక్ష.. 25 నుంచి అమలు..
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- ఉత్తమ గ్రేడుల సాధనకు నిపుణుల సూచనలు

పదికి ప్రత్యేక ప్రణాళిక

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 19 : మనిషి తన జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో చదువుదే కీలక పాత్ర. ఈ చదువులో ఉన్నత విద్య ఎంతో కీలకం. ఈ ఉన్నత విద్యలోని పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల భవితే మరింత ఉజ్వలంగా ఉంటుంది. చదువులో ఉత్తమంగా రాణించేందుకు ఇదే తొలిమెట్టు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టి పదో తరగతి పరీక్షలపైనే ఉంటుంది. అయితే మరో రెండు నెలల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. సిలబస్ చివరి దశలో ఉండడంతో ఉపాధ్యాయులు సన్నద్ధత ప్రారంభించారు. ఈ నెలాఖరులోపు పాఠ్యప్రణాళికను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను పూర్తిస్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ కూడా ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. మార్చిలో జరగబోయే పరీక్షలకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది.

24న కలెక్టర్ సమీక్ష..

టెన్త్ పబ్లిక్ పరీక్షలపై జిల్లాలోని హెచ్ఎంలతో కలెక్టరేట్‌లో ఈ నెల 24న కలెక్టర్ వీపీ గౌతమ్ సమీక్షించనున్నారు. పూర్తయిన పాఠ్యాంశాలు, ప్రగతిపై చర్చించి సూచనలు చేయనున్నారు. సబ్జెక్టు నిపుణుల బృందాలు ఈ నెల 25 నుంచి కార్యాచరణ మొదలు పెట్టనున్నాయి. అలాగే, టెన్త్ పరీక్షల్లో రాష్ట్రంలో జిల్లాను ఉత్తమమైన స్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికలను అమలుపరుస్తున్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్, డీఈవో సోమశేఖరశర్మలు కలిసి నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఈ దఫా భిన్నమైన కార్యాచరణను చేపట్టనున్నారు. ప్రతి మండలంలోనూ నిపుణులైన సబ్జెక్టు టీచర్లతో ఒక బృందాన్ని తయారు చేస్తారు. అలా జిల్లావ్యాప్తంగా 21 బృందాలను ఎంపిక చేస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టు టీచర్లు ఆ బృందంలో ఉండనున్నారు.

సందేహాలకు ఒక రోజు..

సబ్జెక్టు నిపుణులతో ఏర్పాటు చేసిన బృందాల సభ్యులు వారంలో ఒక రోజు క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులందరినీ ఒక దగ్గరకు చేర్చనున్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఏయే అంశాల్లో ఏయే తప్పులు చేయడం వల్ల మార్కులు కోల్పోతారో, ఏయే అంశాల్లో జాగ్రత్తగా ఉండడం వల్ల మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధిస్తారో అనే విషయాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు సబ్జెక్టు నిపుణులు విద్యార్థులకు వివరిస్తారు. అలాగే, వీరితోపాటు డీ, ఈ గ్రేడ్ విద్యార్థులపైనా ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల ఎస్‌జీటీలతో పాఠాలు బోధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సబ్జెక్టు నిపుణులతో కూడిన బృందాలు ప్రత్యేక చొరవ తీసుకుని బోధించనున్నారు.

ప్రత్యేక తరగతులు, పరీక్షలు..

టెన్త్ ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. పరీక్షలకు రెండు నెలల సమయమే ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవడంలో భాగంగా ప్రతీ వారం ప్రత్యేక పరీక్షలు, అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలు పూర్తయ్యాయి. వీటిల్లో వచ్చిన గ్రేడుల ఆధారంగా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.

80 మార్కులకే పరీక్ష..

- పరీక్షకు సంబంధించి ఒక్కో సబ్జెక్టులో 80 మార్కులకు తప్పనిసరిగా 28 మార్కులు రావాలి. మూల్యాంకనంతో కలుపుకొని 35 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు లెక్క.
- ఒక వేళ మూల్యాంకనంలో సున్నా మార్కులోచ్చినా పరీక్షలో 35 మార్కులు వస్తే పాసైనట్లే.
- అలా కాకుండా మూల్యాంకనంలో 20 మార్కులు వచ్చినా సరే పరీక్షలో 28 మార్కులు రాకపోతే అనుత్తీర్ణులుగా పరిగణిస్తారు.
- సెకండ్ లాంగ్వేజ్ పరీక్షల్లో 16 మార్కులు తప్పనిసరి. మూల్యాంకనంతో కలిపి 20 మార్కులొస్తే ఉత్తీర్ణులవుతారు. మూల్యాంకనంలో సున్నా వచ్చి పరీక్షలో 20 వచ్చినా సరిపోతుంది.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..

ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తిస్తాం. వెనుకబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తాజాగా ప్రతీ మండలంలో సబ్జెక్టు నిపుణులతో ఒక టీమును తయారుచేస్తున్నాం. ఆ మండలంలోని విద్యార్థులందరికీ సబ్జెక్టుల్లోని సులువైన, కఠినమైన అంశాలపై అవగాహన కల్పిస్తాం.

-సోమశేఖరశర్మ, డీఈవో, ఖమ్మం

అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు

పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ

ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

అన్నపురెడ్డిపల్లి, జనవరి 19 : జంతువుల పరిరక్షణ, అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ అన్నారు. శుక్రవారం రామవరం రేంజ్ పరిధిలోని అబ్బుగూడెం, మర్రిగూడెం బీట్‌లలో ప్లాంటేషన్‌లను భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌వో కిష్టాగౌడ్‌లతో కలిసి ఆమె పరిశీలించారు. ప్లాంటేషన్‌లోని మొక్కల పెంపకం, చెక్‌డ్యాంలలో నీటి నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవుల్లో వివిధ జాతులకు చెందిన మొక్కలను విరివిగా పెంచాలన్నారు. నాటిన మొక్కలను కాపాడేందుకు నీటిని అందించాలన్నారు. అటవీ జంతువుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వేసవి కాలంలో జంతువులు, పక్షి జాతులకు నీటి వసతి కల్పించాలన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు, ఎఫ్ఆర్వో ఉమ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టాలను అధిగమించి లాభాల్లోకి..

- రూ.10 కోట్ల లాభాల్లో ఖమ్మం డీసీసీబీ
- నాలుగేళ్లల్లో అద్భుత ప్రగతి సాధించాం
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మం వ్యవసాయం, జనవరి 19 : సొసైటీ చైర్మన్ల సహకారం, బ్యాంకు ఉద్యోగుల కృషి ఫలితంగా అనతి కాలంలోనే నష్టాలను అధిగమించి ఖమ్మం డీసీసీబీని రూ.10 కోట్ల లాభాలకు తీసుకొచ్చామని చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. శుక్రవారం డీసీసీబీ సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్‌తో కలిసి డీసీసీబీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరంలో ఖమ్మం డీసీసీబీ టర్నోవర్ రూ.2,375 కోట్లు కాగా.. ప్రస్తుతం రూ.2,948 కోట్లకు చేర్చామన్నారు. గతంలో బ్యాంకు మూలధనం రూ.116 కోట్లు ఉండగా.. ప్రస్తుతం రూ.144 కోట్లకు చేరిందన్నారు. 2020లో రూ.994 కోట్లు కాగా.. ప్రస్తుతం రూ.1,109 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. నాలుగేండ్లలో రూ.115 కోట్ల డిపాజిట్లు అధికంగా సేకరించామన్నారు. నాలుగేండ్ల క్రితం తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టేనాటికి బ్యాంకు రూ.7.23 కోట్ల నష్టాల్లో ఉండగా.. దానిని లాభాల్లోకి తీసుకొచ్చి అద్భుత ప్రగతి సాధించామన్నారు. గతంలో మొండి బకాయిలు రూ.102.39 కోట్లు కాగా.. ప్రస్తుతం రూ.33.64 కోట్లు ఉన్నాయన్నారు. బ్యాంకు పురోభివృద్ధితోపాటు సహకార సంఘాల బలోపేతానికి ప్రత్యేక కృషి చేశామన్నారు. తమ సొంత సొసైటీ వీ వెంకటాయపాలెంను అనేక విభాగాల్లో ప్రగతి పథంలో నడిపించామని గుర్తు చేశారు. గతంలో అన్ని రకాల వ్యాపారాలు కలిసి సొసైటీ టర్నోవర్ రూ.15.89 కోట్లు కాగా.. ప్రస్తుతం తమ సొసైటీ టర్నోవర్ రూ.20.88 కోట్లకు చేరిందన్నారు. ప్రభుత్వం మారడం వల్లే తమపై అవిశ్వాసం పెట్టారని, తాను ఎక్కడ కూడా అవినీతికి చోటు లేకుండా పని చేశానన్నారు. బ్యాంకు, సొసైటీల బలోపేతానికి తనకు సహకరించిన పాలకవర్గ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పంట రుణాల రికవరీపై మరింత దృష్టి సారించామని డీసీసీబీ సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్ తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకు పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. అలాగే మొండి బకాయిలు వసూలు చేయాలని బ్యాంకు మేనేజర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. మార్చి నాటికి వందకు వంద శాతం రుణాల రికవరీ జరిగే విధంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు.

-డీసీసీబీ సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్

మెరుగైన వైద్య సేవలందించాలి

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఆస్పత్రిని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర, జనవరి 19 : వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం మాటూరుపేట పీహెచ్‌సీని సందర్శించిన ఆయన వసతులను పరిశీలించడంతోపాటు రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా రక్త పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు అందించడంతోపాటు రోగులకు అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందించిందన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన ప్రతి రోగికి వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చాలని ఆయన వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సిలార్ సాహెబ్, కటికల సత్యనారాయణరెడ్డి, వైద్యాధికారులు ఉన్నారు.

అంగన్‌వాడీల పాత్ర కీలకం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : చిన్నారుల ఆలనా పాలనా చూస్తూ వారికి సమయానికి పౌష్టికాహారం అందించడంతోపాటు గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు అందించే అంగన్‌వాడీ టీచర్ల పాత్ర అభినందనీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా ప్రభుత్వం మార్చినందున ఉత్తర్వు ప్రతులు అందజేసే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది సేవలను అభినందించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అన్ని బాధ్యతలను అంగన్‌వాడీ సిబ్బంది ఎంతో నేర్పు, ఓర్పుతో చేస్తుంటారని చెప్పారు. గర్భిణి స్థాయి నుంచి బాలింతల వరకు మీ సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. వేతన పెంపుదల కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగు

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మెరుగుపడిందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మారుమూల ప్రాంతాల్లో తాను వైద్యుడిగా పని చేశానని, ఆయా ప్రాంతాల్లో ప్రజలు రక్తహీనతతో ఎక్కువగా బాధపడేవారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల వారి ఆరోగ్యం బాగుపడిందన్నారు. జిల్లాలోని 626 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. వాటి ఉత్తర్వుల ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ రాంబాబు, మహిళా సంక్షేమాధికారి వేల్పుల విజేత, అన్ని ప్రాజెక్టుల సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉత్తర్వుల ప్రతులను అందజేస్తున్న ఎమ్మెల్యేలు కూనంనేని, తెల్లం

29న సర్కార్ బడుల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర విద్యాశాఖ

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

అశ్వారావుపేట, జవనరి 19/ఖమ్మం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ బడుల పరిధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు జీవో విడుదల చేసింది. దీనిలో భాగంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలోని సర్కార్ బడుల్లో ఈనెల 29న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఉభయ జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల ఇప్పటికే విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండలాల స్థాయిలో ఎంఈవోలు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 1,436 బడులు, ఖమ్మం జిల్లావ్యాప్తంగా 1,232 పైగా బడుల్లో పకడ్బందీగా మూజువాణి పద్ధతిలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ పద్ధతి అమలుకాని పక్షంలో అధికారులు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తారు. ఒక వేళ ప్రభుత్వం ప్రకటించిన తేదీన ఎన్నిక నిర్వహించడం సాధ్యం కానీ పక్షంలో కమిటీ మరో తేదీని ప్రకటించే అవకాశం ఉంటుంది. ఎన్నికపై శనివారం ఉదయం 10 గంటలకు ప్రతి పాఠశాల యాజమాన్యం నోటీస్ బోర్డులో నోటిఫికేషన్ ప్రతిని ప్రచురిస్తుంది. అలాగే ఓటర్లైన విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను ప్రదర్శిస్తుంది. జాబితాపై అధికారులు 22, 23వ తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటిని పరిష్కరించి 24న తుది ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. ఎన్నికైన కమిటీ రెండు సంవత్సరాలు పాఠశాల నిర్వహణ, విద్యాహక్కు చట్టం అమలు, బాలల హక్కుల పరిరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తుంది.

నిబంధనల ప్రకారం ప్రక్రియ జరగాలి...

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు సమర్థంగా నిర్వహించేందుకు ఉభయ జిల్లాల డీఈవోలు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరాచారి శుక్రవారం ఎంఈవోలు, హెచ్ఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

సెక్టోరల్స్‌కు పర్యవేక్షణ బాధ్యతలు..

విద్యాశాఖలో పనిచేస్తున్న సెక్టోరల్ అధికారులకు విద్యాశాఖ ఎస్ఎంసీ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. ఖమ్మం జిల్లాలో సెక్టోరల్ అధికారులు కే రవికుమార్, భానుప్రసాద్, రాజశేఖర్, రామకృష్ణ నూతన కమిటీలను ఎన్నుకునే ప్రక్రియలో భాగస్వాములు కానున్నారు. అలాగే భద్రాద్రి జిల్లాలో నియమితులైన సెక్టోరల్ అధికారులు ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఎన్నిక ఇలా..

ఎన్నికలో ఎక్స్ మెంబర్ మెంబర్‌గా హెడ్ మాస్టర్, అదనపు మెంబర్‌గా మరో ఉపాధ్యాయుడిని ఎంఈవో నామినేట్ చేస్తారు. వీరితో పాటు మున్సిపాలిటీ నుంచి కౌన్సిలర్, నగర పంచాయతీ నుంచి లేదా గ్రామ పంచాయతీ నుంచి వార్డు మెంబర్, పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ టీచర్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, మహిళా సమాఖ్య సభ్యురాలు సభ్యులుగా నియమితులవుతారు. కమిటీలో ఇద్దరు కో-ఆప్షన్ సభ్యుల్లో ఒకరిని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధిని నియమించవచ్చు. రెండేళ్లలో డ్రాపౌట్ అయిన వి ద్యార్థుల తల్లిదండ్రుల స్థానంలో మరో సభ్యుడిని ఎన్నుకోవాలి.